# చేజారిన స్వర్గం

రాణి టీచరు అంటే పిల్లలందరికీ ఇష్టమే. ఏదో వంక పెట్టుకుని రాణి టీచరు ఇంటికి పిల్లలు వస్తూనే ఉంటారు. లెక్కలు చెప్పించుకోవాలని ఇంట్లో చెప్పి, భుజాన సంచీ తగిలించుకుని రాణి ఇంటికొచ్చేయడం ఇరుగుపొరుగు పిల్లలందరికి అలవాటయిపోయింది. రాణి ఇంట్లోవున్న జామచెట్టు, రాణి కొనివుంచే చాక్లెట్లు, బిస్కట్లు, రాణి పిల్లల కోసం కొన్న కారమ్‌బోర్డు ఇలాంటివెన్నో కలిసి పిల్లలకి రాణిపై ఇష్టాన్ని పెంచుతున్నాయని అనుకుంటే అది మాత్రం తప్పు! రాణి ఆ పిల్లలందరికీ టీచరు, తల్లి, స్నేహితురాలు. ఆ పిల్లల్లో పరమాత్మ స్వరూపాన్ని చూస్తూ పరమానందపడుతూ ఉంటుంది రాణి. చేజారిన స్వర్గాన్ని తల్చుకుంటూ పరితపిస్తుంటుంది రాణి.

నెలరోజులు సెలవులు గడపడానికి అమ్మమ్మగారింటికి వచ్చిన రాంబాబు రాణి మనసుని పూర్తిగా ఆకట్టేసుకున్నాడు. అదేమి ఋణానుబంధామో మరి!! రెండిళ్ళ వెనక ఉండే రామలక్ష్మి మనుమడు రాంబాబు, అల్లుడు, కూతురు ఢిల్లీలో ఉంటున్నారు.

"మావాణ్ణి కూడా నీ దగ్గరకే పంపుతాను. ఒక్క నెలరోజులు

వాళ్ళ నాన్న వచ్చి తీసికెళ్ళే వరకు నాలుగక్షరం ముక్కలు నేర్పు తల్లీ" అంది రామలక్ష్మి. రాంబాబును రాణి ఇంట్లో దింపి.

కూతురు ఈ మధ్యనే ఆడపిల్లని ప్రసవించిందని, కానీ ఆ పసిగుడ్డు నెల రోజులు తిరక్కుండా తల్లి తండ్రులను శాశ్వతంగా వదిలి వెళ్ళి పోయిందని, దాంతో కూతురు మానసికంగా చాలా కృంగిపోయిందని రామలక్ష్మి రాణితో చెప్పి కన్నీళ్ళు పెట్టుకుంది.

"పురిటిలోనే ఇక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించు కుందేమో, దాని బాధ చూడ లేకుండా ఉన్నామనుకో.... ఏ మాటకామాటే చెప్పాలి. మా అల్లుడు దేవుడంటే నమ్మి....దాని మనసు బాధపడుతుంటే చూడలేక. ఓ పసిగుడ్డును తెచ్చుకుందామంటున్నాడు. ఎవరికి ఎవరు ప్రాప్తమో మరి" - రామలక్ష్మి రాంబాబుని రాణి దగ్గర వదిలి వెళ్ళి పోయింది.

పిల్లవాడిని చూసిన వేళావిశేషం ఏమిటోగాని రాణికి రాంబాబు మీద విపరీతమైన ప్రేమాభిమానాలు పెరిగిపోయాయి. ఆ పిల్లవాడు ఒక్క సాయంత్రం రాకపోయినా రాణికి తోచని పరిస్థితి ఏర్పడింది.

రాంబాబు తెల్లగా బొద్దుగా ఉంటాడు. నవ్వుతుంటే బుగ్గలు సొట్టలు పడుతూ ఎంతో ముద్దుగా ఉంటాడు.

తలవంచుకుని పుస్తకం చదువుకుంటున్నా రాంబాబు వైపు చూస్తూ కూచుంది రాణి.

"అమ్మాయ్, గడియారం ఆగిపోయింది.... కీ యియ్యమ్మా" - గదిలో పడుకున్న తల్లి చత్వారం కళ్ళజోడు సరిచేసుకుంటూ అంది.

"గడియారం ఆగిపోతే ఏమైంది.... మన పనులన్నీ వరుసగా జరిగిపోతున్నాయిగా" రాణి పుస్తకాలు సద్దుతూ అంది.

అంతలోకే రాంబాబు బల్లవేసుకుని గోడ గడియారానికి కీ ఇవ్వటం అయిపోయింది.

రాంబాబు పుస్తకాల సంచి సర్దుకున్నాడు. తల్లికి అన్నం పెట్ట డానికి రాణి లోపలకెళ్ళింది.

రాణి మనసు పొరలు కదులుతున్నాయి. జీవితంలో ఉన్న శూన్య మంతా ఒక్క క్షణంలో బట్టబయలయిపోయినట్టనిపించింది....రామలక్ష్మి మాటలు మనసులో మళ్ళీ మళ్ళీ ధ్వనిస్తున్నాయి. "వాళ్ళ అల్లుడు దేముడా, భార్య బాధపడుతుంటే చూడలేక అనాధాశ్రమం నుంచి ఓ పిల్లని తెస్తాడా" – రాణి ఆ మాట నుంచి బయటపడలేకపోయింది.

"తనెందుకు తెచ్చుకోకూడదూ" – రాణికి ఎందుకో నవ్వొచ్చింది.

రాణి తల్లిపున్న గదిలోకొచ్చింది. అప్పుడే తల్లి గుర్రుపెట్టి నిద్ర పోతోంది. ఈ తల్లి గొంతునొక్కి చంపేస్తే ఏం రాణి నిద్రపోతున్న తల్లివంకే చూసింది క్షణం – తను తల్లిని చంపాలనుకోటం ఏమిటీ, తను హంతకురాలవుతుందా! తను ఒకవిధంగా హంతకురాలేగా!! కాదా!! రాణి నిలువెల్ల వణికిపోయింది. గతం కళ్ళ ముందు కదులుతుంటే, మనసు మరల్చుకునే ప్రయత్నం విఫలమైంది, రాణి కళ్ళు గట్టిగా మూసుకుంది.

జగదీష్ – ఎలా ఉన్నాడో, ఎక్కడున్నాడో....గడియారం తొమ్మిది గంటలు కొట్టింది....ఏం చేస్తుంటాడిప్పుడూ – భార్య, తను భోజనం చేసివుంటారు ...లేకపోతే, భోజనం చేసి కబుర్లు చెప్పుకుంటూ పెద్ద మంచం మీద ఇద్దరూ రాణి కళ్ళు అప్రయత్నంగా మూసుకుంది....

వంటింట్లోంచి పాలగిన్నె కిందపడింది. పిల్లి తోసేసింది. రాణి లేచి గిన్నెపైన పెడదామనుకుంది ... ఆ.... పోనిద్దూ – జీవితమే ఒలికి పోయింది – పాలు ఒలికిపోతే ఏమైందీ!! రాణి కూర్చున్నచోట నుంచి కదలలేదు.

"అమ్మాయి.... ఆ బి.పి. మాత్ర యియ్యి తల్లీ" – గదిలోంచి తల్లి రాణీతో అంటోంది.

"ఒకటి కాదు, వంద మాత్రలు ఇస్తాను" – రాణి కసిగా లేచింది అక్కడనుంచి.

తల్లికి ఒక మాత్ర, మంచినీళ్ళు ఇచ్చి, తను కూడా గ్లాసెడు నీళ్ళు గబగబా తాగేసింది రాణి.

రాణి బి.ఏ. పాసయింది. నల్లగా పొడుగ్గా ఎంతో అందంగా ఉండేది. పొడవైన జడ ఆ నడకకు ఎంతో నిండుతనాన్నిచ్చేది. రాణి తండ్రి ఎవరు ఎక్కడ కనిపించినా రాణి పెళ్ళి విషయమే మాట్లాడేవాడు.

ఆ రోజు ఆఫీసు నుంచి వెంకట్రామయ్య వస్తుండే దారిలో కలిశాడు సుబ్బారావు.

"అమ్మాయికి పెళ్ళి చేసే ఆలోచన వుందా లేదా?" - సుబ్బారావు ఆ మాట అనగానే కస్సున లేచాడు వెంకట్రామయ్య. "ఆడపిల్లకి పెళ్ళి చేయవద్దనుకునే తండ్రి వుంటాడా? .... కాకపోతే, కట్నాలు కానుకలు ఇవ్వలేని నా లాటి బీద తండ్రి బాధలు నీలాటి కొడుకుల తండ్రులకి ఎలా అర్థమవుతాయిలే" అన్నాడు వెంటనే.

"మా వాళ్ళ అబ్బాయి దుబాయ్‌నించి వచ్చాడు. నెల రోజుల్లో వెళ్ళిపోతాడు, బోల్డు సంపాదన - చూద్దామంటావా మరి" - వెంకట్రామయ్య ఫక్కున నవ్వాడు.

"మా అమ్మాయి నల్లపిల్ల - నేను కట్నాలు ఇచ్చుకోలేనివాణ్ణి - మరి ఇంత మంచి సంబంధం నువ్వు కుదర్చగలిగితే, నాకింకేం కావాలీ"- వెంకట్రామయ్య సుబ్బారావుతో కలిసి సందు చివరిదాకా నడిచాడు. వెంకట్రామయ్య, సుబ్బారావు చిన్నప్పటి క్లాసుమేట్సు.

"ఘటన వుంటే అదే కుదురుతుంది. నేను ఆ విషయం బాధ్యత తీసుకుంటా. రాణి బంగారు తల్లి. దానికి దేవుడు మంచి సంబంధం కుదురుస్తాడులే. మనమెవరం చేయడానికి?" - సుబ్బారావు మాటలు ఎంతో ఆశాజనకంగా అనిపించి గొప్ప ఆనందం కలిగింది వెంకట్రామయ్యకి.

రాణికి కళ్యాణం తోసుకొచ్చేసింది .... పందిట్లో పెళ్ళయిపోయింది.

"ఇంకో నెల సెలవు పొడిగించాలని ఉంది. ఎలాగో మరి—నిన్ను వదిలి వెళ్ళలేను రాణీ" - జగదీష్ కౌగిలిలో ఉక్కిరి బిక్కిరయింది రాణి .... నెల రోజులు పెంచిన సెలవు చూస్తుండగానే గడిచిపోయింది.

డాబా మీద కూచుని కొత్త దంపతులు ఎన్నో ముచ్చట్లు చెప్పుకున్నారు.

"మనం ఇద్దరం — మనకిద్దరు — అంతేనా" — జగదీష్ మాటలకి కిల కిలా నవ్వింది రాణి.

"ఒక్కళ్ళు చాలరా."

"ఒక్కళ్ళు చాలరు - ఒకళ్ళకొక తోడు ఉండాలి — ఇన్నాళ్ళకి నా కలలు ఫలించాయి .... నా భార్య, నా ఇల్లు, నా పిల్లలు - కావాలని ఎంతగా కోరుకున్నానో తెలుసా .... మన స్వర్గం అంతే .... నువ్వెలాగూ రాణీవే అనుకో" జగదీష్ మాటలకు, కళ్ళల్లో ఆ కాంతికి విస్తుపోతూ, ఆనందంలో మునిగిపోయింది రాణి. భార్యా, భర్త భవిష్యత్తు గురించి ముచ్చటించుకున్నారు ఆ వెన్నెల రాత్రి.

* * *

జగదీష్ వెళ్ళి రెండు నెలలు దాటింది. రాణీకి రెండు నెలలు పూర్తయ్యాయి.

ఫోనులో రాణి గొంతుతో శుభవార్త విన్న జగదీష్, "రెక్కలు కట్టుకు వాలాలనుంది. ఎలాగ, రాణీ! ఆరోగ్యం జాగ్రత్త. వీలయినంత త్వరలో వచ్చేస్తాను" అంటూ ఎంతోసేపు మాట్లాడాడు. రాణి బుగ్గల్లో సిగ్గు మొగ్గలు తొడిగింది. "ఆ ఉద్యోగం మానేసి వచ్చేయమంటాను" ఇక్కడే ఏదో చూసుకోవచ్చు. రాణీ ఇలా రకరకాలుగా అనుకుంటూ రోజులు గడుపుతోంది. రెండు నెలలు పూర్తయి పదిరోజులయిపోయింది.

రాణి జడ అల్లుకుంటూ దొడ్లో ఉన్న గట్టు మీద కూచుంది. "అమ్మాయ్!" తండ్రి గొంతు విని ఉలిక్కిపడింది రాణి. "అమ్మ నీతో ఏదో మాట్లాడుతుందిట" వెళ్ళిపోయాడు తండ్రి అక్కడ నుంచి.

తల్లి సిగలో జాజిపూల దండ తురుముకుంటూ, సిగపిన్ను నోట్లో పెట్టుకొని వచ్చి రాణి పక్కన కూచుంది మనమడో, మనుమరాలో, ఎవర్ని ఎత్తుకు ఆడించాలోనని ఎంతో ఉత్సాహంగా ఉంది తల్లి అనుకుంది రాణి.

పూలవాన కోసం తల వంచితే రాళ్ళవాన కురిస్తే?! కురిస్తే?!

"నేను, నాన్న అదే అనుకుంటున్నాము. మీరిద్దరూ హాయిగా ఓ రెండేళ్ళు కాపురం చేశాక పిల్లలు, జంజాటం బాగుంటుంది. మరీ ఇప్పుడే", తల్లి పొడి పొడిగా అక్కడ అక్కడ ఒక్కొక్క మాట అంటుంటే అర్థం కాలేదు రాణికి.

"ఏమంటున్నావో, నాకేం తెలియటం లేదు" రాణి పొడుగాటి జడ అల్లుకోటం అయింది.

"ఇట్లాంటివి మేము చెప్పకూడదు - మీ నాన్న కూడా అదే అంటున్నారు. మా కాలం అంటే అది వేరు. పైగా అతను ఎప్పుడొస్తాడో, ఏమో. ఓ రెండేళ్ళు అతను రాలేకపోతే. ఈ పసిగుడ్డును – కాపాడుకుంటూ - ఎందుకీ బాధ్యత నీకూ" తల్లి రాణివంక చూసింది.

"అంటే - నేనేమయినా చిన్నదానినా - నాకు ముప్ఫయి ఏళ్ళు, అతనికి ముప్ఫయి అయిదేళ్ళు - అయినా వెంటనే పిల్లలు కావాలనే మేము అనుకున్నాం", రాణి సిగ్గుపడుతూ జడ ముందుకేసుకుని అంది తల్లితో.

"ఇదిగో నా మాట కాస్త విను .... ఇప్పుడే పిల్లలు పుట్టేస్తే అతనికి నీమీద శ్రద్ధ తగ్గిపోతుంది. నువ్వెప్పుడూ పిల్లలు, పిల్లలు అనుకుంటూ కూచుంటే మరి అతను మగాడు ..ఏ అడ్డదారయినా తొక్కితే" తల్లి గొంతు తగ్గించింది. రాణికి నోటమాట రాలేదు. తల్లి తండ్రి ఏం చెప్పాలనుకుంటున్నారో అర్థమయిపోయింది.

"అయినా అతను ఏడాది లోపల వచ్చేస్తానంటున్నాడుగా" తల్లి నెమ్మదిగా అంది.

తనని అబార్షన్ చేయించుకోమని చెప్తున్న వీళ్ళు తన తల్లి

తండ్రులా — లోకంలో ఎక్కడైనా ఉంటుందా ఇది - తను పిల్లల తల్లి అయితే జగదీష్ తనని ప్రేమించడా — జగదీష్ వేరొకరితో సంబంధం పెట్టుకుంటాడా — ఛీ ఛీ — రాణి మనసు భగభగ మండిపోయింది. వీళ్ళు తనను కన్న తల్లితండ్రులు కారు — రాక్షసులు!! అంతే!!

"రాణీ.... ఈ రోజుల్లో ఇవేవీ తప్పు కాదు — నేను లోకానుభవంతో చెప్తున్నా. మీ నాన్న...." తల్లి మాట పూర్తిచేయలేదు.

"అమ్మా....ఈ విషయంలో నాకెవరి సలహా అక్కర్లేదు. జగదీష్‌కి ఫోనుచేసి చెప్పాను కూడా."

"ఏమిటీ — చెప్పేశావా" తల్లి కంగారుగా అంది.

"చెప్పినా ఫరవాలేదు....మిస్ కారేజ్ అని మళ్ళీ ఏదో చెప్పుకోవచ్చు" గుమ్మం అవతల నుంచి తండ్రిగొంతు పలికింది.

వెంకట్రామయ్య కళ్ళ ముందు చెల్లెలు జానకి కదలాడింది.... ఏడాది తిరక్కుండా పిల్లని ఎత్తుకున్న జానకి నాలుగేళ్ళయేసరికి భర్తకు దూరమయిపోయింది. ఆనాడు జానకి భర్త మాటను కాదని తను, తన భార్య ప్రోత్సహించి జానకి పురుడు బాధ్యత వహించారు. అంతే అయితే లోకంలో భర్తలందరూ జానకి భర్తలాగ ఉన్నారా - కానీ జానకి జీవితం వెంకట్రామయ్య మనసుని ఎంతగా గాయపరిచిందంటే పెళ్ళయిన వాళ్ళెవరూ నాలుగేళ్ళ వరకు పిల్లల్ని కనకూడదనే మూర్ఖపు ఆవేశానికి దారితీసింది. ఇలా అన్నందుకు వెంకట్రామయ్య ఎందరికో శత్రువయ్యాడు. అయినా తను జానకి విషయంలో జరిగిన అన్యాయాన్ని మరిచిపోలేకపోయాడు. ఆఖరికి తన కూతురి విషయంలో కూడా అదే అభిప్రాయం చెప్పడానికి వెనుకాడలేదు.

రాణి అలానే ఆ గట్టుమీద కూర్చుంది. మనసు ముక్కముక్కలయింది. లోకంలో ఎక్కడో ఏదో జరిగితే, అందరికీ అలా జరుగుతుందా — రాణికి ఒక్కసారి ఒళ్ళు జలదరించింది — తల్లి తండ్రి తన

శ్రేయోభిలాషులు — వాళ్ళు చెప్పేదాంట్లో కొంతయినా నిజంవుండదా!! ఏమో!!

"రాణీ సినిమాకెడదాం అంటాడు" జగదీష్.

"అమ్మో - పసివాణ్ణి ఎలా వదలి రానూ" అంటుంది తను.

"రాణీ వారం రోజులు ఊటీ వెళ్ళి వద్దాం రా" అంటాడు జగదీష్.

"బాబోయ్ - అంత చలిలో పసివాణ్ణి ఎలా చూసుకోగలం" అంటుంది తను.

"బాబుకి పోతపాలేగా, మీ అమ్మ దగ్గర ఉంచు. నాలుగు రోజులు అలా వెళ్ళి వద్దాం" అంటాడు జగదీష్.

"బాబుని చూడకుండా నాలుగు రోజులుండలేనండీ" అంటుంది తను.

ఇంతే, ఇంతే, ఇలాగే జగదీష్ మెల్లగా మెల్లగా తననుంచి దూరమయిపోతాడా. అమ్మ నాన్న చెప్పినట్టు మగాడి మనసు అంత తొందరగా మారిపోతుందేమో — ఏమో!! రాణి మనసు సంఘర్షణతో కొట్టుమిట్టాడింది. ఏ పనిచేయాలో, ఏ పని చేయకూడదో మనసు తేల్చుకోలేకపోయింది.

రాణి మనసు మెల్లమెల్లగా మరో ఆలోచన వైపు దారితీసింది. తన తల్లితండ్రులు చెప్పేదాంట్లో నిజం ఉందేమో!!

వారం రోజులు గడిచాయి. వారం రోజులు తల్లి తండ్రి ఇదే విషయం చెప్తూనే ఉన్నారు.

రాణి మనసులో గట్టిగా నిశ్చయం చేసుకుంది, నర్సింగ్‌హోమ్‌లో అడుగుపెడుతుంటే కాళ్ళు గజగజ వణికాయి. గుండె పట్టుకున్నట్టే అయింది.

ప్రాణం పోయటం కష్టం కానీ. ప్రాణం తీయటం చాలా తేలిక!!

ఇంట్లో అడుగుపెట్టిన రాణి దుఃఖం ఆపుకోలేకపోయింది. జగదీష్‌కి ఏం చెప్పాలి - ఆడవాళ్ళందరూ కోరుకొనే మాతృత్వం క్షణాలలో తనెలా పోగొట్టుకుందీ!!

"అమ్మా - జగదీష్ ఫోన్ చేస్తే నేను ఇంట్లో లేనని చెప్పండి" రాణి గొంతు పెగిలి మాటలు రావటం లేదు.

తను భర్తకు తెలియనీయకుండా ఇలా చేయటం తప్పా కాదా!! పిల్ల తల్లి అయిన తనను భర్త ఎంతో ప్రేమగా, గౌరవంగా చూసేవాడా, కాదా!! ఏమో!! ఇలాటి వాటికి నేటికీ సమాధానం దొరక్క తల్లడిల్లి పోయింది రాణి.

కానీ, మనసును సమాధానపర్చుకుందుకు ఎంతో ప్రయత్నించింది. జగదీష్ ఏడాది తిరక్కుండా వచ్చేస్తాడు - తను, భర్త, సంసారం' తరువాత పిల్లలు, వాళ్ళ స్కూళ్ళు - వాళ్ళ పెళ్ళిళ్ళు - ఓహ్ - సంసారం సాగరం!! రాణికి నవ్వాగలేదు. పైకి పకపకా నవ్వేస్తుంటే తల్లి తండ్రి ఖంగారుపడిపోయారు.

"నేను ఏడుస్తే భయం, నేను నవ్వితే భయం-ఏమిటిది. మీకెందుకీ ఖంగారు. నాకు పిచ్చి పట్టిందేమోననుకుంటున్నారా...." రాణి మాటలకి విస్తుపోయారు తల్లి తండ్రి.

కాలం పరిగెత్తింది. ఏది రహస్యంగా దాచాలనుకుంటామో, అది ఖచ్చితంగా బయటపడిపోతుంది. మైళ్ళ దూరానున్న జగదీష్ ఉన్నట్టుండి ఇంటికి రాగానే నోట మాట రాలేదు రాణికి, ముఖం చెల్లలేదు రాణి తల్లి తండ్రులకి.

రాణి ఎందుకు అబార్షన్ చేయించుకుందో, ఆ విషయం తన దగ్గర ఎందుకు దాచిందో ఎంత ఆలోచించినా బోధపడలేదు. కానీ మనసు చిత్రమైంది కదా!! సమాధానాలు దొరక్కపోతే, కొన్ని సమాధానాలు సృష్టించే శక్తి దానికుంది!!

రాణి తనని మోసం చేసిందని, పెళ్ళి కాకముందే రాణి గర్భవతి అయిందని, ఏ స్నేహితుల సలహాతోనో ఈ సాహసం చేసిందని, తను మోసపోయానని జగదీష్ మనసులో ఖాయపర్చుకున్నాడు.

నెల రోజులు తిరక్కుండా జగదీష్ వెళ్ళిపోయాడు. ఈ తరవాత రాణికి విడాకులొచ్చేశాయి .... ఏ దారెటు పోతుందో!!

రాణి టీచరంటే పిల్లలందరికీ ఇష్టమే. రాంబాబు ఆ సాయంత్రం ఇంటి కెళ్ళిపోయాక, రామలక్ష్మి మాటలే రాణి చెవుల్లో మారుమ్రోగాయి.

అనాథాశ్రమం నుంచి తనెందుకు ఒక పిల్లని తెచ్చుకు పెంచుకో కూడదూ!! అన్నీ బావుంటే తనకీ రాంబాబు అంత కొడుకుండేవాడు కాడూ!!

తల్లి గాఢ నిద్రలో వుంది - తండ్రి న్యూస్‌పేపరు చదువుతున్నాడు .... గడియారం రెండు గంటలు చూపించింది. రాణి చెప్పులు తొడుక్కుని బయటికి నడిచింది. "నా జీవితం నాది–నాకు ఎవరి సలహాతో పనిలేదు" తనలో అనుకుంటూ వీధి గేటు దాటింది రాణి.

రాణి మనసు మనసులో లేదు. ఉయ్యాల తొట్టిలో వున్న పసికూనలను చూస్తుంటే తను పోగొట్టుకున్న మాతృత్వం పొంగి పొర్లింది. అబ్బాయి నా కొద్దు. అమ్మాయినే పెంచుతాను అనుకుంటూ ఆ ఉయ్యాల తొట్టి ముందు కన్నార్పకుండా చూస్తూ నిల్చుంది రాణి.

ఆడపిల్లతో ఎన్ని సమస్యలూ .... అబ్బాయి అయితే తనకి కాస్త సాయంగా ఉంటాడు .... ఏమైనా మగ మహారాజు కదా-మరో ఉయ్యాల తొట్టి ముందు మళ్ళీ ఆగింది రాణి. నాలుగు రోజులు వరుసగా వచ్చిన రాణి చివరకి తను మొదటి రోజు చూసిన పాపను తీసుకెళ్ళాలని నిశ్చయించుకుంది.

"ఈ పాప కావాలని మొన్న ఒకళ్లు అడిగారు మీరు తేల్చుకుని చెప్పాలి. రేపు పది గంటలకి వాళ్ళొస్తారు" అక్కడ అధికారిణి మాటలు అర్థమయ్యాయి రాణికి. ఇంటి కొచ్చేసింది. మనసు ఎటూ తేల్చుకోలేక పోతోంది. వారం రోజులు గడిచిపోయాయి.

రాణి ఆశ్రమానికి వెళ్ళాలి వెళ్ళాలి అనుకుంటూనే ఉంది. ఆ పాప ఉందో లేదో - ఆ ఊరికే అలా అంటుంది కానీ, ఆ పాపని నా కోసం

ఉంచుతుంది - ఎవరికీ ఇవ్వదు అని కూడా, రాణి కిటికీలోంచి వీధిలోకి చూస్తూ అనుకుంటోంది మనసులో.

రాంబాబు పరిగెత్తుకు వచ్చాడు. "ఆంటీ, మా ఇంటికి రండి - మా అమ్మమ్మ అర్జంటుగా మిమ్మల్ని తీసుకు రమ్మంది. మీకో తమాషా చూపిస్తాం" రాంబాబు ఉత్సాహం ఆగేట్టు లేదు.

"మా అమ్మ నాన్నా వచ్చారు ఆంటీ - ఎల్లుండి నేను వెళ్ళిపోతున్నా. తొందరగా రండి ఆంటీ" రాంబాబు హడావిడి చేస్తుంటే, రాణి చెప్పులు తొడుక్కొని, తలుపు దగ్గరగా వేసి రాంబాబు వెంట నడిచింది.

రాణిని లోపలికి తీసుకెళ్ళింది రామలక్ష్మి. పొత్తిళ్ళలో ఒత్తిగిల్లి నిద్రపోతున్న పసికందును చూడగానే రాణి నివ్వెరపోయింది.

"ఈ పాపనే కదూ తను తెచ్చుకుందామనుకున్నదీ" రాణి ఆ పసిగుడ్డు వంక కన్నార్పకుండా చూసింది.

"మళ్ళీ స్వర్గం చేజారి పోయిందా!!" కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"మా మమ్మీ, మా డాడీ" రాంబాబు తండ్రి పక్కన నిలబడ్డాడు.

రాణికి కాళ్ళ కింద నేల కదిలిపోయింది రాంబాబు తండ్రిని చూడగానే.... అతనే! అతనే! అతను!!

ఒక్క సెకను అక్కడ నిలవలేక గబుక్కున వెనుదిరిగింది రాణి.

"ఆంటీ, ఆంటీ, ఉండండి — స్వీట్లు తెస్తున్నా" రాంబాబు అరుస్తున్నాడు.

"వెళ్ళనీ, పాపం, ఆవిడని" - జగదీష్ గుండె గొంతుకలో కొట్టాడుతుంటే, రాణి వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయాడు. అందులోని అనంతార్థాలు ఆ పసిగుడ్డుకు తెలుసు కాబోలు ఇటు తిరిగి నవ్వి అటు ఒత్తిగిల్లి పడుకుంది ప్రశాంతంగా!

* [తెలుగు-సాహిత్య మాసపత్రిక, జులై, 1995] *